క్లుప్తంగా

పీఎం కిసాన్‌కు ఈ-కేవైసీ తప్పనిసరి

చారకొండ/లింగాల: పీఎం కిసాన్‌కు అర్హులైన రైతులు తప్పనిసరిగా బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవడంతో పాటు ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చిన్నహుస్సేన్ శనివారం తెలియజేశారు. గ్రామాల వారీగా సంబంధిత ఏఈఓలకు లబ్ధిదారులు ఆధార్ కార్డుతో తమ వివారాలను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. బుధవారం వరకు చేసుకున్నా రైతులకు తమ ఖాతాల్లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఏడాదికి రూ.ఆరు వేలు జమ అవుతాయన్నారు.

చెంచుగూడెలలో వైద్య శిబిరం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని మొలచింతలపల్లి సమీపంలోని భ్రమరంభ కాలనీ, మొలచింతపల్లి చెంచుగూడెం, ఎల్లూరు చెంచుగూడెంలో ఐటీడీఏ మన్ననూర్ ఆధ్వర్యంలో పెంట్లవెల్లి పీహెచ్‌సీ డాక్టర్ల సమక్షంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచులందరికీ ఉచిత చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు చికిత్సలు నిర్వహించి మందులు అందజేశారు. రక్తహీనత ఉన్న చిన్నపిల్లలను గుర్తించి చికిత్సలు చేశారు. డాక్టర్లు చంద్రశేఖర్, రోహిత్, రాజీవ్, సంతోష్ పాల్గొన్నారు.

ముస్లింల నిరసన

కొల్లాపూర్: మున్సిపల్ కార్యాలయం ఎదుట రెండోరోజు ముస్లింలు ధర్నా నిర్వహించారు. పట్టణంలోని తోళ్లగేరి సమీపంలోని శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ముస్లింలకు న్యాయం చేయాలన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో వినతి అందజేశారు. నయూమ్, ఖాదర్‌పాష పాల్గొన్నారు.

పాడి కౌశిక్‌రెడ్డి తీరును ఖండించాలి

కొల్లాపూర్: ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి తీరును ప్రతిఒక్కరూ ఖండించాలని ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు కట్టా శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హన్మకొండ జిల్లాలో ఓ ప్రైవేటు టీవీ చానల్‌లో కెమెరామెన్‌గా పని చేస్తున్న అజయ్ ముదిరాజ్‌ను కిడ్నాప్ చేయించి, బెదిరించిన ఘటన దురదృష్టకరమన్నారు. కౌశిక్‌రెడ్డి మొదట్నుంచి ముదిరాజ్‌లను అవమానపర్చేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఆయనపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లక్ష్మణ్ ముదిరాజ్, రాముడుయాదవ్, రామకృష్ణగౌడ్, ఎండీ.ఖలీల్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

కల్వకుర్తి రూరల్: మండలంలోని పంజుగులలో శనివారం బొడ్రాయి పండుగ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఈదమ్మ, కోటమైసమ్మ, బొడ్రాయికి గ్రామంలోని మహిళలు శనివారం బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి నీళ్లు పోశారు.

ప్రశాంతంగా ప్రవేశపరీక్ష

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్‌లో శనివారం ఆరో తరగతికి నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మోడల్ హైస్కూల్ ఆరో తరగతిలో విద్యార్థులు చేరేందుకు 52 మంది ప్రవేశ పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ పుష్పలత తెలియజేశారు. రాధాకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

ఆక్రమణల తొలంగింపు

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలోని విద్యానగర్ కాలనీ రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను కమిషనర్ ఆశ్రిత్ కుమార్ వారి సిబ్బందితో శనివారం తొలగించారు. విద్యానగర్ కాలనీలోని సర్వే నంబర్ 53లో గ్యాస్ గోదాం వెనుకాల ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డును అక్కడి వ్యక్తులు ఆక్రమించగా.. వాటిని తొలగించారు.

పనులు పూర్తి చేయాలి

చారకొండ: గ్రామాల్లో అవసరమైన సామూహిక ఇంకుడు గుంతలను పూర్తి చేయాలని డీఎల్‌పీఓ పండరినాథ్ అన్నారు. మండలంలోని జూపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో సాముహిక ఇంకుడు గుంతల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. డీఎల్‌పీఓ పండరినాథ్ హాజరై పనులను ప్రారంభించారు. వారి వెంట ఎంపీడీఓ జయసుధ, ఎంపీఓ వెంకటేష్, సర్పంచ్‌లు మల్లీశ్వరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం ఎదుట నిరసన

అమ్రాబాద్: ఆలయ పూజల కోసం దూపదీప నైవేద్యం సేవలను గ్రామస్తులకే ఇవ్వాలని పదర మండలం కోడోనిపల్లి వాసులు ఆదివారం గ్రామ ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి, ఎండోమెంట్ కమిషనర్‌కు వినతి అందజేశారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో గోవర్ధన్, శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

నిధులు మంజూరు

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపూర్ అభివృద్ధి పనుల కోసం స్థానిక ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి రూ.కోటి పైబడి నిధులు మంజూరు చేసినట్లు సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తెలియజేశారు. గ్రామంలోని యాదవులకు కమ్యూనిటీ భవనం, మాదిగబాయిబండ వద్ద షెడ్ నిర్మాణం, శ్మశానవాటికకు మట్టి రోడ్డు, పెంట్లవెల్లి నుంచి గోపులాపూర్‌కి మట్టి రోడ్డు, గ్రామాల్లో డ్రెయినేజీ నిర్మాణం, గ్రామ అభివృద్ధికి గతంలో ఎమ్మెల్యేను నిధులు కోరగా.. నేడు ఆయన నిధులు మంజూరు చేశారని చెప్పారు. శనివారం సర్పంచ్, గ్రామస్తులు ఎమ్మెల్యే చేతుల మీదుగా నిధుల విడుదల పత్రాన్ని అందుకున్నారు.

ప్రైవేటుకు దీటుగా ఆంగ్ల మాధ్యమం

బిజినేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు చక్కగా చెప్పరనే అపోహ తల్లిదండ్రుల్లో ఉందని, కాని ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే జ్ఞానవంతమైన ఆంగ్లమాధ్యమంలో విద్య అందుతుందని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం తిమ్మాజిపేట మండలంలోని బాజీపూర్, గుమ్మకొండ, తిమ్మాజిపేట గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు బోధన చేస్తారని, వారి కృషి ఫలితంగానే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. తల్లిదండ్రుల సంపాదన అంతా విద్య, వైద్యానికే ధారపోస్తున్నారని, ఈ దుస్థితి నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తే వారి ఆదాయం పెరిగి ప్రజలు అభివృద్ధిలో పయనిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు తప్పనిరిగా గ్రామంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలన్నారు. డీఈఓ గోవిందరాజులు, ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ దయాకర్‌రెడ్డి, తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీఓ కరుణశ్రీ, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాలెంలో ఆరోగ్య ఉపకేంద్రానికి శంకుస్థాపన..

బిజినేపల్లి: మండలంలోని పాలెంలో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, పాలెం సర్పంచ్ లావణ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. త్వరలోనే ఈ ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య ఉపకేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

సైబర్ నేరాలపై షీ టీం అవగాహన

తెలకపల్లి: సైబర్ నేరాలు, బాలికల వేధింపులపై షీ టీం అధికారులు అవగాహన కల్పించారు. శనివారం మండల పరిధిలోని గొరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో షీ టీం మెంబర్ వెంకటయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌లో కొనసాగుతున్న మోసాలపై ప్రతివిద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ వలలో చిక్కుకోకూడదని విద్యార్థులకు సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు, విద్యార్థినులు షీ టీం నంబర్ 8712657676 లేదా 100కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలు జరిగితే 1098కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. మల్లికార్జున్, శ్వేత, వెంకట్, పాండు, మౌనిక, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న షీ టీం మెంబర్ వెంకటయ్య

బల్మూర్: విద్యార్థులు సైబర్‌నేరాలపై అవగాహన కలిగి ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ చాంద్‌పాష సూచించారు. శనివారం ఉన్నత పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు రాంగ్ కాల్స్, ఓటీపీ పిన్ వంటి వ్యక్తి గత విషయాలను ఇతరులకు అందించవద్దని సూచించారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

పెద్దకొత్తపల్లి: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా కమిటీ నాయకులు ఆర్ శ్రీనివాసులు కోరారు. పెద్దకార్పాములలో శనివారం ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 20 ఏళ్ల కిందట పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కోసం సర్వే నంబర్ 301, 302లో 19 ఎకరాల 14 గుంటల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసింది. నేటికి పంపిణీ చేయకుండా వదిలివేయడంతో ఆ స్థలంలో విజయ, డెయిరీ, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ భవనాలు నిర్మించారు. మిగిలిన స్థలాలను పేదలకు పంపిణీ చేయాలని కోరారు. చిన్నకొత్తపల్లి, కొత్తయాపట్ల, పాతయాపట్ల గ్రామాల్లో ప్రభుత్వం సేకరించిన భూమిని పేదలకు పంపిణీ చేయకపోవడంతో ఇతరులు ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాసులు, దశరథం, బాలకృష్ణయ్య, మల్లయ్య, బాలస్వామి పాల్గొన్నారు.

రైతు మృతిపై కేసు నమోదు

వెల్దండ: మండల పరిధిలోని అజిలాపూర్‌కి చెందిన కాలే పుల్లయ్య శుక్రవారం విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. శనివారం మృతుని కుమారుడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

మహిళ అదృశ్యం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఓ కాలనీకి చెందిన మహిళ అదృశ్యమైంది. ఈ మేరకు మహిళ తండ్రి ఫిర్యాదు మేరకు శనివారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. గత నెల 23న పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ తిరిగి ఇంటికి రాలేదు. అప్పటి నుంచి బంధువుల ఇళ్లలో వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో శనివారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో మహిళ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలియజేశారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

వెల్దండ: మండల పరిధిలోని రాచూర్‌లో గుత్తి రామకృష్ణ రైతుకు చెందిన పాడిఆవు శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షంలో పిడుగుపాటుకు గురై మృతిచెందినట్లు తెలిపారు. శనివారం రైతు రామకృష్ణ వ్యవసాయ పొలానికి వెళ్లి చూడగా.. ఆవు మృతిచెందినట్లు గుర్తించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తెలకపల్లి: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్‌కు చెందిన రాములు, ఊశన్నలు 2 ట్రాక్టర్లను ఉప్పునుంతల మండలం నుంచి ఇసుకను నింపుకొని నాగర్‌కర్నూల్ తరిస్తుండగా శనివారం తెలకపల్లి సమీపంలో పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లు రాములు, ఊశన్నలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

5 లీటర్ల సారా పట్టివేత

కోడేరు: మండలంలోని నాగులపల్లితండాకు చెందిన ఓ వ్యక్తి కోడేరుకు అయిదు లీటర్ల సారాను తరలిస్తుండగా.. ఎక్సైజ్ ఎస్‌ఐ శంకర్, శేఖర్‌రెడ్డి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండలంలో ఎవరైనా సారా విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చందన్‌గౌడ్, మహేష్, ఉన్నారు.

పోలిశెట్టిపల్లి తండా వద్ద..

బల్మూర్: మండలంలోని పోలిశెట్టిపల్లి తండా వద్ద శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై సారా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు. పోలిశెట్టిపల్లికి చెందిన సేవ్యా అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై పది లీటర్ల సారాను అక్రమంగా తరలిస్తుండగా.. అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్‌ఐ సతీష్‌కుమార్, సిబ్బంది నవీన్, పరమేశ్వర్, పాల్గొన్నట్లు వివరించారు.

ప్లాట్లను ఇప్పించాలని ఆందోళన



అంబేద్కర్ విగ్రహం ఎదుట కూర్చున్న బాధితులు

కొల్లాపూర్: పట్టణ సమీపంలోని చౌటబెట్ల శివారులో సర్వే నంబర్ 104లో ప్లాట్లు కొనుగోలు చేసిన పలువురు శనివారం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ మహిమూదాబేగం భర్త ఖాదర్‌పాష రెండేళ్ల కిందట 104 సర్వే నంబర్‌లో దాదాపుగా ఆరున్నర ఎకరాల మేరకు భూమిని కొనుగోలు చేసి రియల్ వెంచర్ ఏర్పాటు చేశాడు. సమీపంలోని ఇతరుల ప్లాట్లు కబ్జా చేసి వెంచర్ ఏర్పాటు చేశాడని కొంతకాలంగా గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ప్లాట్లు కోల్పోయిన బాధితులు శనివారం దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మేము 12 సంవత్సరాల కిందట వనపర్తికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారుల వద్ద సర్వే నంబర్ 104లో ప్లాట్లను కొనుగోలు చేశామన్నారు. రెండేళ్ల కిందట అదే సర్వే నంబర్‌లో భూమిని కొన్న ఖాదర్ పాష మా ప్లాట్లను అక్రమంగా కబ్జా చేసుకుని కంపౌండ్ కట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. రామకృష్ణ, లక్ష్మయ్య, రాజు, పలువురు మహిళలు ఉన్నారు.

క్రమం తప్పకుండా రుణాలు చెల్లించాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులు ఐకేపీ ద్వారా ఆయా బ్యాంకుల నుంచి పొందిన రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తే వడ్డీ తగ్గుతుందని ఏపీడీ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు ప్రతి నెల విధిగా సమావేశాలు నిర్వహించుకుని ఆయా బ్యాంకుల ద్వార తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేందుకు తీర్మానాలు చేయడంతో పాటు బ్యాంకుల్లో చెల్లించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. సమావేశంలో ఏపీఎం తిరుపతయ్య, సీసీలు లక్ష్మణ్, పార్వతమ్మ, పద్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ లక్ష్మీనారాయణ

కల్వకుర్తి చేరుకున్న జీపుజాతా

కల్వకుర్తి రూరల్: అంగన్‌వాడీలో పని చేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఆ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మీ డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌ను రక్షించాలని ఈ నెల 16న ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైన తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జీపు జాతా శనివారం కల్వకుర్తి పట్టణానికి చేరుకుంది. పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం జయలక్ష్మి మాట్లాడారు. ఈ యాత్ర ఈ నెల 30న రంగారెడ్డి జిల్లాలో ముగుస్తుందన్నారు.



ఆషాఢం గోరింటాకు సంబరాలు



రెడ్డి భవన్‌లో గోరింటాకు సంబరాలు

అచ్చంపేట: పట్టణంలోని రెడ్డి భవన్‌లో శుక్రవారం నియోజకవర్గ మహిళా రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఆషాఢం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. పార్వతి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించి చేతులపై గోరింటాకు అలంకరించుకున్నారు. వంద మంది మహిళలు పాల్గొన్నారు. రెడ్డి సేవా సమితి మహిళా అధ్యక్షురాలు జె.కవిత, మున్సిపల్ వైస్ చైర్మన్ పోరెడ్డి శైలజ, కౌన్సిలర్ సునిత పాల్గొన్నారు.

ఆరు నుంచి జీపీ కార్మికుల సమ్మె



సమ్మె నోటీసు అందజేస్తున్న జీపీ కార్మికులు

అచ్చంపేట: గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె జూలై 6 నుంచి చేపట్టనున్నామని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు నోటీసు ఇచ్చినట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ తెలియజేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వేమయ్య, బాలస్వామి, శ్రీనివాసులు, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో ముందుకు సాగాలి



నిత్యావసర సరుకులు అందజేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

కొల్లాపూర్: సేవా దృక్పథంతో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ ఈఐసీ అధికారి జూలూరి రమేష్‌బాబు సూచించారు. శనివారం కొల్లాపూర్‌లో వనిత గోల్డ్‌క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఓ రైతుకు ఉచితంగా ఎరువులు అందించారు. రిటైర్డ్ ఆర్మీ జవాన్‌కు కందిపప్పు, బియ్యం బస్తాతో పాటు కిరాణ సామగ్రి అందజేశారు. 20 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎంసీహెచ్ ఆస్పత్రి వద్ద సిమెంట్ బెంచీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడారు. వాసవీ, వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అర్థం శ్రీనివాసులు, ఓరుగంటి కిషోర్‌గుప్త, శ్రీధర్, చిత్తనూరు శ్రీదేవి, రాధిక, హారిక, విజయలక్ష్మీ, మాధవి పాల్గొన్నారు.

ఆలయ భూమి కబ్జాపై ఫిర్యాదు

వెల్దండ: మండల పరిధిలోని గుండాలలోని అంబా రామలింగేశ్వరస్వామి ఆలయ భూమి కబ్జాకు గురికావడంతో సర్పంచ్ మైసయ్య, ఈఓ ప్రసాద్, అర్చకులు బాలస్వామి, మురారి శనివారం వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేవాదాయశాఖ వారు ఆలయ పేరున గుండాలకి చెందిన జబ్బు మల్లయ్య, జబ్బు ఆంజనేయులు రైతుల నుంచి 2014 సంవత్సరంలో సర్వే నంబర్ 25లో 0.25 గుంటల భూమిని కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఆ భూమి దేవాదాయశాఖ పరిధిలో ఉంది. గ్రామపంచాయతీ వారు హరితహారంలో మొక్కలు నాటించారు. కొంత మంది భూ వ్యాపారులు దేవాలయ భూమిని ఆక్రమించి ఇతరులకు విక్రయిస్తున్నారని పోలీసులు, రెవెన్యూశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

మార్పు కోసం మహా ఉద్యమం

కల్వకుర్తి రూరల్: దగాపడ్డ తెలంగాణలో మార్పు కోసం మహా ఉద్యమం చేస్తామని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్ యాదవ్, లా ఫోరం కన్వీనర్ హరిప్రసాద్ అన్నారు. శనివారం కల్వకుర్తిలో విలేకరులతో మాట్లాడారు. విద్యారంగంలో విద్యార్థుల సమస్యలు, విద్యార్థి నిరుద్యోగ ప్రజా వ్యతిరేఖ పాలనతో పాటు రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. మార్పు కోసం ప్రతి విద్యార్థి తమతో కలిసి రావాలని హరిప్రసాద్, ప్రశాంత్ యాదవ్ కోరారు. ఆంజనేయులు, ప్రసాద్, నవీన్, రవితేజ పాల్గొన్నారు.

ఫీజులను తగ్గించాలి

కల్వకుర్తి రూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో విపరీతంగా పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఫీజుల తగ్గింపు కోసం మేధావులు, విద్యాసంఘాలు, ప్రజా సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పెద్దయ్య యాదవ్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

బీసీబంధు పథకం దరఖాస్తుల పరిశీలన

వెల్దండ: మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు బీసీ బంధు పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడంతో శనివారం గ్రామ పంచాయతీలో దరఖాస్తులను పరిశీలించారు. ఈ సదంర్భంగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు స్థానికంగా ఉంటున్నారా, ఆధార్‌కార్డు అడ్రస్‌లు, పూర్తి వివరాలు సక్రమంగా ఉన్నాయ తదితర అంశాలను కార్యదర్శులు పరిశీలించారు. మండలంలోని 32 గ్రామపంచాయతీలకు గాను 17 గ్రామపంచాయతీల నుంచి 869 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు అయినట్లు గుర్తించారు. ఈ నెల 26న మండల స్థాయిలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో కార్యదర్శుల నుంచి దరఖాస్తులను స్వీకరించి జిల్లా కేంద్రానికి అందజేస్తామన్నారు. ఎంపీఓ సునీత, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఐక్యత ఫౌండేషన్ చేయూత

కల్వకుర్తి రూరల్: కల్వకుర్తి నుంచి కురుమిద్దెకు వెళ్లే మట్టి రోడ్డు గుంతలమయంగా మారింది. గ్రామస్తుల కోరిక మేరకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రోడ్డు మరమ్మతుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా శనివారం రోడ్డు మరమ్మతులకు రూ.2 లక్షలు చెక్కును ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి గ్రామస్తులకు అందజేశారు. శేఖర్, కృష్ణారెడ్డి, యాదయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన అవసరం




క్షయవ్యాధి నివారణపై విద్యార్థులకు అవగాహన

ఉప్పునుంతల: క్షయపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ ఎంహెచ్‌ఓ తారాసింగ్ సూచించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణ చికిత్స పొందుతున్న పలువురు వ్యాధిగ్రస్తులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. మందులు సకాలంలో వేసుకోవాలని సూచించారు. అనంతరం తాడూరు యంపీయూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు క్షయవ్యాధి, నివారణ అంశంపై అవగాహన కల్పించారు. వారం రోజులకు మించి దగ్గు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్షయవ్యాధి చికిత్స తీసుకుంటున్న వారికి పౌష్టికాహారం కోసం ప్రతినెల రూ.500 వారి ఖాతాలో జమ అవుతాయని తెలియజేశారు. ఆయన వెంట వైద్యాధికారిణి స్వప్న, వైద్య సిబ్బంది శంకరమ్మ అంజునాయక్ తదితరులు ఉన్నారు.

చెంచు రైతులకు విత్తనాల పంపిణీ

లింగాల: మండల పరిధిలోని శాయిన్‌పేట, శ్రీరంగాపూర్ గ్రామాల్లోని చెంచు రైతులకు కోనేర్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం చిరుధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ సమన్వయ కర్తలు పెద్దులు, ఇస్మాయిల్ మాట్లాడారు. ఆహార ధాన్యాల పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. వాణిజ్య పంటలకు అధిక పెట్టుబడులు పెట్టి నష్టపోవద్దని సూచించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఇచ్చే చిరుధాన్యాల పంటలను సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పించారు. కందులు, పచ్చజొన్నలు, రాగి విత్తనాలను అందజేశారు. వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది రాము, లింగస్వామి, శంకరయ్య, మహేష్, ఆయా గ్రామాల చెంచు రైతులు పాల్గొన్నారు.



శ్రీరంగాపూర్‌లో చెంచు రైతులకు విత్తనాలను అందజేస్తున్న కోనేర్ సంస్థ ప్రతినిధులు

కష్టపడిన వారికే టికెట్ ఇవ్వాలి

పెంట్లవెల్లి: కాంగ్రెస్ పార్టీలో కొల్లాపూర్ నియోజకవర్గానికి ఎవరూ లేనప్పుడు పార్టీని తన భుజాలపై వేసుకుని పార్టీ బలోపేతానికి కృషిచేసిన చింతలపల్లి జగదీశ్వర్‌రావుకు నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఇతర నాయకులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఎంతో ఆసక్తి చూపుతున్నారన్నారు. టికెట్ ఇవ్వకుంటే నాయకులమంతా రాజీనామా చేస్తామన్నారు. రామకృష్ణగౌడ్, ఫిరోజ్, మోహన్, రవి, భీంలా, నరేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

తాడూరు: గ్రామాల స్థాయిలో ఉపాధి పనులను వేగవంతం చేసి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ గంగమోహన్ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి సిబ్బంది ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల వారీగా మంజూరైన పనులు వాటి అమలు, కూలీల సంఖ్య వివిధ అంశాలను సమీక్షించి పనులపై వారికి అవగాహన కల్పించారు. నాటిన మొక్కలను సంరక్షించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. సమావేశంలో ఎంపీఓ లక్ష్మణ్ నాయక్, ఏపీఓ ప్రవీణ్, ఈసీ కిషన్ నాయక్ పాల్గొన్నారు.

యాపట్లకు ఆర్టీసీ బస్సు నడపాలి

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన బస్సు యాపట్లకు నడపాలని గ్రామస్తులు జహంగీర్, బాలకృష్ణ, మల్లేష్ కోరారు. ప్రస్తుతం గ్రామానికి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో విద్యార్థులు పెద్దకొత్తపల్లి, పెద్దకార్పాముల, అంబటిపల్లి పాఠశాలలకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు.